నామినేషన్ల ప్రక్రియకు సహకరించాలి

- రేపటి నుంచి 25వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ
- పార్లమెంట్ అభ్యర్థులకు రూ.12,500 డిపాజిట్
- రూ.95లక్షలకు మించి ఖర్చు చేయొద్దు
- పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పీ ప్రావీణ్య

ఖిలా వరంగల్, ఏప్రిల్ 16: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు అన్ని రాజకీయపార్టీలు పూర్తి సహకారం అందించాలని వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పీ ప్రావీణ్య కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నామినేషన్ల ప్రక్రియపై జిల్లాలోని రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని పేర్కొన్నారు. ఈనెల 26న నామినేషన్ల పరిశీలన, 29న ఉపసంహరణ ఉంటాయని వివరించారు. వరంగల్ కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ అధికారి చాంబర్‌లో నామినేషన్ల స్వీకరణ ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషను స్వీకరించనున్నట్లు తెలిపారు. నామినేషన్ దాఖలుకు వచ్చిన అభ్యర్థులతో పాటు అనుమతించే వ్యక్తులు, వాహనాలు, తదితర అంశాలను కలెక్టర్ వివరించారు. నామినేషన్ వేయడానికి ముందే అభ్యర్థి పేర ఏదైనా జాతీయ బ్యాంకులో ఎన్నికల ఖర్చుల కోసం కొత్త ఖాతా తెరవాలని సూచించారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం ఎస్సీకి రిజర్వ్ అయినందున అభ్యర్థులు రూ.12,500 సెక్యూరిటీ డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల సందర్భంగా ప్రచురించే కరపత్రాల విషయంలో ప్రజా ప్రతినిధ్య చట్టంలోని 127-ఏ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా అభ్యర్థులు రూ.95లక్షలకు మించి ఖర్చు చేయొద్దని స్పష్టం చేశారు. డీఆర్వో శ్రీనివాస్, జడ్పీ సీఈవో రాంరెడ్డి, ఈ-డిస్ట్రిక్ మేనేజర్ రాజ్‌కుమార్, ఎన్నికల పర్యవేక్షకులు విశ్వనారాయణ, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

వరంగల్ కలెక్టరేట్‌లో నామినేషన్ల స్వీకరణ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ పీ ప్రావీణ్య, సీపీ అంబర్ కిశోర్‌ఝా

ఏర్పాట్ల పరిశీలన

వరంగల్ పార్లమెంట్ నామినేషన్ల ప్రక్రియ ఏర్పాట్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య మంగళవారం సీపీ అంబర్ కిశోర్‌ఝా, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీసీపీ అబ్దుల్ బారీ, ట్రైనీ ఐపీఎస్ శుభంనాగ్, డీఆర్వో శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. కలెక్టర్ బారికేడ్ల ఏర్పాటు, పోలీస్ బందోబస్తు, మీడియా పాయింట్ తదితర ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వంద మీటర్ల దూరం వరకు సూచికబోర్డులు ఏర్పాటు చేసి ఇతరులను ప్రవేశించకుండా పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. నామినేషన్ల స్క్రూటినీ సమాచారం అభ్యర్థులకు తెలియజేసేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. నామినేషన్ల పూర్తి ప్రక్రియను సీసీ కెమెరాలు, వీడియోగ్రఫీతో చేపట్టాలన్నారు. అభ్యర్థి ఆర్వో గదిలోకి ప్రవేశించగానే కనబడేలా గడియారం ఏర్పాటు చేయాలన్నారు. వరంగల్ సీపీ అంబర్ కిషోర్‌ఝా మాట్లాడుతూ నామినేషన్ కేంద్రానికి 100 మీటర్ల మేర ఇరువైపులా బారికేడ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నామినేషన్ వేసే అభ్యర్థులు 30నిమిషాలు ముందే కేంద్రానికి చేరుకోవాలన్నారు. డీపీఆర్వో అయూబ్‌అలీ, ఏసీపీ దేవేందర్ రెడ్డి, ఏవో శ్రీకాంత్, వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్ పాల్గొన్నారు.

అర్హులకు అందని కేంద్ర పథకాలు

ఆత్మకూరు, ఏప్రిల్ 16 : పేదలకు సంక్షేమ పథకాలను అందించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలంగాణ సామాజిక ఆర్థికవేత్త, ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ ఆరోపించారు. మంగళవారం ఆత్మకూరులో ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో చాలామంది యువకులు ఉపాధి లేక హైదరాబాద్ వంటి నగరాలకు వలస పోతున్నారన్నారు. 2008లో ప్రవేశపెట్టిన జాతీయ ఉపాధి పథకం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలు జీవనోపాధి పొందుతున్నాయన్నారు. పది సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం పేద ప్రజలకు ప్రత్యక్షంగా ఉపయోగపడే ఎలాంటి పథకాలను ప్రవేశపెట్టలేదన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్య శాఖ చైర్మన్ బయ్య తిరుపతి, మాజీ సర్పంచ్ పర్వతగిరి రాజు, నియోజకవర్గ యూత్ కన్వీనర్ మాదాసి శ్రీధర్, యూత్ అధ్యక్షుడు తన్గుల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో ప్రయాణికుడి మృతి

వరంగల్ చౌరస్తా, ఏప్రిల్ 16: ఆర్టీసీ బస్సులో గుర్తు తెలియని ప్రయాణికుడు మృతిచెందిన ఘటన వరంగల్ బస్టాండ్‌లో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ – నర్సంపేట ఆర్టీసీ బస్సులో మెట్‌పల్లి నుంచి వరంగల్ వరకు ప్రయాణించేందుకు టికెట్ తీసుకున్నాడు. అతడి ఆరోగ్యం బాగాలేదని, బస్సు దిగే సమయంలో సహకరించాలని మెట్‌పల్లి బస్టాండ్‌లో ఇద్దరు వ్యక్తులు బస్ డ్రైవర్ బీ మోతి, కండక్టర్ ఈ రాజ్‌కుమార్‌ను కోరారు. బస్సు వరంగల్ బస్టాండ్‌కు చేరినప్పటికీ దిగకపోవడంతో కండక్టర్ తట్టి లేపే ప్రయత్నం చేయగా అప్పటికే మృతి చెందాడు. సమాచారం ఇవ్వగా పోలీసులు చేరుకొని బస్సును ఎంజీఎం మార్చురీకి తరలించి, మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు. మృతుడి వివరాలు తెలిసిన వారు ఇంతెజార్‌గంజ్ పోలీస్టేషన్‌లో కానీ, 8712685118 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

మహిళ అదృశ్యం

కుసుమ దివ్య

ఖానాపురం, ఏప్రిల్ 16 : మండలంలోని మంగళవారిపేటకు చెందిన వివాహిత కుసుమ దివ్య(30) అదృశ్యమైనట్లు కేసు నమోదైంది. ఎస్సై రఘునాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. దివ్య ఈనెల 15న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. ఆ సమయంలో లైట్ గ్రీన్ కలర్ చీర ధరించింది. ఆచూకీ తెలిసినవారు 8712485234, 8712685025కి ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. తండ్రి దాసరి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

ప్లాట్లు అమ్మబడును

★వరంగల్ ట్రైసిటీకి హైవేలను ఆనుకొని ఉన్న మా వెంచర్లలో ప్లాట్లు తక్కువ ధరలలో అమ్మబడును. సంప్రదించవలసిన సెల్ నెంబర్. 9701396797.
NTW-323041

లోన్స్

★SBH లో ఖాతా ఉన్న ప్రభుత్వ ఉద్యోగస్తులకు శుభవార్త, ఎటువంటి సమస్యలున్న Solve చేసి లోన్స్ ఇప్పించబడును. సంప్రదించండి సెల్ : 9493910808.
NTW-00

WANTED

★Wanted Cinema Managers to work at Asian Gemini theatre, experience: 5-10 years, interested ones call to 8121021251, hr.corp@asiancinemas.in
NT-6583

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

ఐసీఏఐ ఎస్ఐఆర్‌సీ కోఆప్టెడ్ మెంబర్‌గా పీవీ నారాయణరావు

పోచమ్మమైదాన్, ఏప్రిల్ 16: దశాబ్దులుగా విస్తృతంగా సేవలు అందిస్తున్న ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ పీవీ నారాయణరావును ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ)కు సంబంధించిన దక్షిణ భారత ప్రాంతీయ మండలి (ఎస్ఐఆర్‌సీ)లో పబ్లిక్ అండ్ గవర్నమెంట్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ కమిటీలో కోఆప్టెడ్ మెంబర్‌గా మంగళవారం నియమించారు. 2024–2025 సంవత్సరానికి గాను ఆయన కొనసాగుతారు. ప్రపంచస్థాయిలో పేరొందిన ఐసీఏఐకు సంబంధించిన ఎస్ఐఆర్‌సీ ప్రముఖ కమిటీల్లో ఒకటి. వరంగల్‌కు చెందిన నారాయణరావు అనుభవం, సేవలను గుర్తించి ఈ నియామకం చేసినట్లు సంబంధిత చైర్‌పర్సన్ బీ.గీత ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ ప్రభుత్వ, పబ్లిక్ రంగాలే కాకుండా గ్రామీణ స్థాయిలో స్థానిక సంస్థలను సైతం ఆధునిక సాంకేతిక అకౌంటింగ్ విధానాన్ని కార్యనిర్వహణ స్థాయిని కల్పించేలా శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. కాగా, నారాయణరావును జిల్లాలోని సీనియర్ చార్టెడ్ అకౌంటెంట్లు, సీఏలు అభినందనలు తెలిపారు.

యువతను విస్మరించిన బీజేపీ

విద్యా రుణాల నిలిపివేత దారుణం ● ఏఐసీసీ సెక్రటరీ రోహిత్ చౌదరి

సమావేశంలో నిద్రపోతున్న రేవూరి ప్రకాశ్‌రెడ్డి

న్యూశాయంపేట, ఏప్రిల్ 16 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం యువతను విస్మరించిందని ఏఐసీసీ సెక్రటరీ రోహిత్ చౌదరి మండిపడ్డారు. హంటర్‌రోడ్డులోని డీ కన్వెన్షన్‌లో ఎన్ఎస్‌యూఐ వరంగల్ పార్లమెంట్ స్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. ప్రధాని మోదీ పదేళ్లుగా విద్యా రుణాలను నిలిపివేశారని, ఉద్యోగాలు ఇవ్వడం లేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కులం, మతం ఆధారంగా ప్రజలను చీల్చే కుట్రలు చేస్తోందని ఎమ్మెల్యే రేవూరి ప్రకావ్‌రెడ్డి అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ కొత్త ఉద్యోగాలు ఇవ్వకపోగా... ఉన్నవాటిని ఊడబీకుతున్నారని, రిజర్వేషన్ వ్యవస్థను రద్దు చేసే కుట్రలు చేస్తున్నారని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. పదేండ్ల బీజేపీ పాలనలో దళిత, క్రిస్టియన్, ముస్లిం మహిళలకు రక్షణ లేదన్నారు. ఈడీ, సీబీఐని అడ్డుపెట్టుకొని ప్రతిపక్షాలను కేసులతో ఇబ్బందులు పెడుతోందని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి అన్నారు. కాజీపేట రైల్వే జంక్షన్‌పై నిర్లక్ష్యం చేసింది బీజేపీ పాలకులేనని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. మూడు నల్ల చట్టాలు తెచ్చి రైతులను పొట్టన పెట్టుకున్న బీజేపీకి గుణపాఠం చెప్పాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ అన్నారు. అలాగే కడియం కావ్య గురించి మాట్లాడితే అరూరి రమేశ్‌ను తరిమి కొడతామని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. వర్ధన్నపేటలో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయిన చెల్లని రూపాయి అరూరి వరంగల్ ఎంపీ ఎలా గెలుస్తాడని కడియం కావ్య ఎద్దేవా చేశారు. భూ ఆక్రమణలకు పాల్పడిన అరూరికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు.

నిద్రలోకి జారుకున్న రేవూరి..

కాంగ్రెస్ వరంగల్ పార్లమెంటరీ సన్నాహక సమావేశంలో ఇన్‌చార్జి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి నిద్రలోకి జారుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య మాట్లాడుతున్న క్రమంలో రేవూరి కునుకు తీశాడు. సమావేశంలో పీసీసీ సెక్రటరీ బట్టి శ్రీనివాస్, ఎన్ఎస్‌యూఐ వైస్ ప్రెసిడెంట్ సూర చందనరెడ్డి, కార్పొరేటర్ మామిండ్ల రాజు పాల్గొన్నారు.

నగదు స్వాధీనం

ఖిలావరంగల్, ఏప్రిల్ 16: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో వరంగల్ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద తనిఖీలు చేపట్టినట్లు వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ తెలిపారు. ఈ తనిఖీలో ఎలాంటి రశీదులు లేకుండా డబ్బు రవాణా చేస్తున్న శివనగర్‌కు చెందిన పత్తిపాక రమేశ్ వద్ద రూ.2.50లక్షలు, పెరికవాడకు చెందిన పాశికట్టి శంకర్ వద్ద రూ.1,77,200, ఖిలా వరంగల్ చెందిన తోట జగన్ వద్ద రూ.1,10,000 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మొత్తం రూ.5,37,200 నగదును ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్‌కు అప్పగించినట్లు ఏసీపీ తెలిపారు. మిల్స్‌కాలనీ, ఇంతెజార్‌గంజ్, మట్టెవాడ ఇన్‌స్పెక్టర్లు పీ మల్లయ్య, ఎం శివకుమార్, టీ గోపి, ఎస్సై మునీరుల్ల మొహ్మద్ పాల్గొన్నారు.

1 నుంచి స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 16 : కేయూ సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచింగ్ ఆధ్వర్యంలో స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై జూన్ 1వ తేదీ నుంచి 40 రోజుల శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సంచాలకులు మేఘనారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఫీజు యూనివర్సిటీ విద్యార్థులకు రూ.వెయ్యి, ఇతరులకు రూ.1500 ఉంటుందని, మే 20వ తేదీ వరకు పేర్లు నమోదు చేసుకోవచ్చని, వివరాలకు విశ్వవిద్యాలయ www.kakatiya.ac.in సంప్రదించాలన్నారు.

గంజాయి స్వాధీనం

దామెర, ఏప్రిల్ 16 : మండలంలోని ల్యాదెళ్ల గ్రామంలో మంగళవారం అనుమానాస్పదంగా ఉన్న ముగ్గురు వ్యక్తుల నుంచి గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై కొంక అశోక్ తెలిపారు. అన్నపూర్ణ రైస్ మిల్లు సమీపంలోని స్టోన్ క్రషర్‌కు వెళ్లే దారిలో అనుమానాస్పదంగా ఉన్న ఖిలావరంగల్‌కు చెందిన గద్దల భరత్ (23), పోచమ్మమైదాన్‌కు చెందిన జన్ను విలాస్ (22), జిల్లా అఖిల్ (22) పెట్రోలింగ్ వాహనాన్ని చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేసి 140గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎర్ర మురళి సమక్షంలో పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కూతుళ్లు

చెన్నారావుపేట, ఏప్రిల్ 16: తండ్రి మరణించడంతో కూతుళ్లే పాడె మోసి తలకొరివి పెట్టారు. ఈ ఘటన మండలంలోని ఎల్లాయగూడెంలో మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని రజక కులస్తుడు నల్లతీగల రాములు అనారోగ్యంతో మృతి చెందాడు. అతడికి నలుగురు ఆడపిల్లలు ఉన్నారు. కొడుకులు లేకపోవడంతో వారే పాడె మోసి, కుండ పట్టి, చితికి నిప్పుపెటారు. కూతుళ్లే అంత్యక్రియలు చేయడంతో గ్రామస్తుల హృదయాలను కదిలించింది.

హద్దుల తొలగింపు

ఖిలా వరంగల్, ఏప్రిల్ 16 : గ్రేటర్ వరంగల్ 17వ డివిజన్‌లోని బొల్లికుంటలో అక్రమ లేఔట్ ప్లాట్లపై బల్దియా అధికారులు దృష్టిసారించారు. బొల్లికుంట, గాడిపల్లి, దూపకుంట, వసంతపురం, స్తంభంపల్లి, ఆదర్శనగర్ గ్రామాల్లో పదుల సంఖ్యలో అనుమతులు లేకుండా ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో టౌన్ ప్లానింగ్ అధికారులు బొల్లికుంటలోని ఓ లేఔట్ హద్దులను తొలగించారు.

బీసీల ప్రస్తావనే లేని మేనిఫెస్టో

పోచమ్మమైదాన్, ఏప్రిల్ 16: బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోలో బీసీ డిమాండ్ల ప్రస్తావనే లేదని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోలో బీసీలను పట్టించుకోలేదని, బీసీ కులగణన జరుగాలని, చట్టసభల్లో బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కేటాయించాలని ఉద్యమిస్తుంటే, వివిధ రాష్ట్రాలు శాసనసభలో తీర్మానం చేసిన కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి గుణపాఠం చెప్పాలని కోరారు.

పకడ్బందీగా విధులు నిర్వర్తించాలి

హనుమకొండ, ఏప్రిల్ 16 : ఎన్నికల తనిఖీ బృందాలు తమ విధులను పకడ్బందీగా నిర్వర్తించాలని అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని సెక్టోరల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిస్టికల్ సర్వేలెన్స్ బృందాలు, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ టీమ్స్, వీడియో సర్వేలైన్స్ టీమ్స్‌తో సమీక్ష నిర్వహించారు.

నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న టీఎన్జీవో నేతలు

ఏఎంఏ ఎన్నికలు ఏకగ్రీవం

హనుమకొండ, ఏప్రిల్ 16 : ఉమ్మడి వరంగల్ జిల్లా తెలంగాణ అగ్రికల్చర్ మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ ఎన్నికలు హనుమకొండలోని టీఎన్జీవోస్ భవన్‌లో జరిగాయి. టీఎన్జీవో కేంద్ర సంఘ కార్యవర్గ సభ్యులు లక్ష్మీ ప్రసాద్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. అధ్యక్షుడిగా నటరాజ్, కార్యదర్శిగా సునీత, అసోసియేట్ అధ్యక్షుడిగా ఐజాజ్ అహ్మద్, కోశాధికారిగా కిరణ్ కుమార్ ఎన్నికయ్యారు. కార్యక్రమానికి అసోసియేషన్ కేంద్ర సంఘ కార్యదర్శి, హనుమకొండ జిల్లా కోశాధికారి పనికెల రాజేశ్ అధ్యక్షత వహించగా హనుమకొండ, వరంగల్, భూపాలపల్లి, ములుగు జిల్లాల అధ్యక్షులు ఆకుల రాజేందర్, గజ్జెల రామ్‌కిషన్, బూరుగు రవి, పోలు రాజు, హనుమకొండ, వరంగల్, భూపాలపల్లి జిల్లాల కార్యదర్శులు బైరి సోమయ్య, గాజె వేణుగోపాల్, దశరథం, కేంద్ర సంఘ నాయకులు శ్యామ్ సుందర్, మొయిజ్, జిల్లా నాయకులు పుల్లూరు వేణుగోపాల్, సలీం, రామ్ ప్రసాద్, రాజేశ్ ఖన్నా, భగవాన్ రెడ్డి, ఉదయ్‌భాస్కర్, రాజీవ్, ప్రణయ్, అశోక్ పాల్గొన్నారు.

బీజేపీలోకి ఆహ్వానిస్తున్న ఆరూరి రమేశ్, జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ

బీజేపీలో చేరికలు

హనుమకొండ, ఏప్రిల్ 16 : గ్రేటర్ వరంగల్ 46వ డివిజన్ నుంచి వివిధ పార్టీల నేతలు బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్, హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ సమక్షంలో పార్టీలో చేరారు. వారికి అరూరి, పద్మ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. బీజేపీలో చేరిన వారిలో రాజన్‌బాబు, పెంటం సాంబయ్య, మహ్మద్ రహీం పాషా, దువ్వ శ్రీధర్, గోనెల అన్నమయ్య, పసుల కిషన్, దోమకొండ కిషన్, మునిగాల కాళీదాస్, మునిగాల బాబు, యాకయ్య, బండి వెంకన్న, గడ్డ సదానందంతో పాటు మరో 200 మంది ఉన్నారు. జిల్లా నాయకులు సంతోష్‌రెడ్డి, రాజేశ్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, 45,46వ డివిజన్ అధ్యక్షుడు శివ, దువ్వ నవీన్, నాయకులు దువ్వ సురేశ్, వెంకట్‌రావు, మహేందర్, శ్రీకాంత్, కొమురయ్య, వినోద్ పాల్గొన్నారు.

కాజీపేటను రైల్వే డివిజన్ చేయాలి

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ● రైల్వే డీఆర్‌ఎం బీకే జైన్‌కు వినతి

కాజీపేట, ఏప్రిల్ 16 : కాజీపేటను రైల్వే డివిజన్‌గా గుర్తించి, సమస్యలను పరిష్కరించాలని సికింద్రాబాద్ రైల్వే డీఆర్‌ఎం బీకే జైన్‌ను ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కోరారు. సికింద్రాబాద్‌లోని డీఆర్‌ఎం కార్యాలయంలో ఆయనను మంగళవారం ఎమ్మెల్యే కలిసి రైల్వే సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కాజీపేట రైల్వే స్టేషన్ ప్రాంగణంలోనే బస్టాండ్‌ను ఏర్పాటు చేయాలని, వ్యాగెన్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ సామర్థ్యం పెంచి త్వరగా పూర్తి చేయాలని, కాజీపేట–సికింద్రాబాద్ మూడోలైన్ పూర్తి చేయాలని, కాజీపేట నుంచి వివిధ ప్రాంతాలకు కొత్త రైళ్లు నడపాలని, ఐటీఐ అప్రెంటీస్ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలని వినతి పత్రంలో కోరారు. డీఆర్‌ఎంను కలిసిన వారిలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌రావు, టీపీసీసీ కార్యదర్శి శ్రీనివాస్‌రావు ఉన్నారు.

తెలంగాణ ఉద్యమకారుడు రవీందర్ మృతి

శాయంపేట, ఏప్రిల్ 16 : కొప్పుల గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు జలుగూరి రవీందర్ (44) గుండెపోటుతో సోమవారం మృతిచెందాడు. తెలంగాణ ఉద్యమంలో 2001 నుంచి రవీందర్ కీలకంగా వ్యవహరించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి మంగళవారం కొప్పులకు వెళ్లి రవీందర్ మృతదేహంపై పూలమాల వేసి, బీఆర్‌ఎస్ పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. ఉద్యమంలో తన వెంట నడిచిన రవీందర్ విగతజీవిగా మారడంతో ఆయన విషాదంలో మునిగిపోయారు. అనంతరం రవీందర్ శవ పేటికను మోస్తూ అంతిమయాత్రలో పాల్గొన్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి రవీందర్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మాజీ మండలాధ్యక్షుడు గుర్రం రవీందర్, బగ్గి రమేశ్, బుర్ర విజయ్, బేర్గు రాకేశ్, నిమ్మల మహేందర్, కొమ్ముల శివ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

15లోగా నాలా అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

● కలెక్టర్ సిక్తా పట్నాయక్ ● అధికారులతో సమావేశం

హనుమకొండ, ఏప్రిల్ 16 : నగరంలోని నయీంనగర్ వంతెన నుంచి ప్రారంభమైన నాలా అభివృద్ధి పనులు జూన్ 15లోగా పూర్తి చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి రెవెన్యూ, మున్సిపల్, టౌన్ ప్లానింగ్, సాగునీటి పారుదల, ఇంజినీరింగ్ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. నాలా ఇరువైపులా కొనసాగుతున్న నిర్మాణ పనులు, బఫర్ జోన్ వివరాలు, పూడికతీత, అభివృద్ధి పనుల సందర్భంగా ఎదురవుతున్న ఇబ్బందులు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. నాలా అభివృద్ధికి సంబంధించిన పనులపై యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆర్డీవో వెంకటేశ్, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఈఈలు రాజయ్య, ఈఈ ఆంజనేయులు, ఎస్ఈ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వీసీలో పాల్గొన్న కలెక్టర్..

ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికలపై నల్లగొండ కలెక్టరేట్ నుంచి రిటర్నింగ్ అధికారి, నల్గొండ కలెక్టర్ హరిచందన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్ సిక్తా పట్నాయక్, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ఆర్డీవోలు నారాయణ, వెంకటేశ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న నయీంనగర్ నాలా పనులు

రోజు విడిచి రోజు తాగునీటి సరఫరా

వరంగల్, ఏప్రిల్ 16 : నగరంలోని నయీంనగర్ బ్రిడ్జి నిర్మాణ పనుల్లో భాగంగా పైప్‌లైన్ పూర్తిగా తొలగించిన నేపథ్యంలో పలు ప్రాంతాలకు రోజు విడిచి రోజు తాగునీటి సరఫరా చేయనున్నట్లు బల్దియా ఈఈ రాజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇంద్రానగర్, గుడిబండల్, మచిలీబజార్, కాపువాడ, బ్రహ్మణవాడ, సాయినగర్‌తో పాటు పద్మాక్షి వాటర్ ట్యాంక్ పరిధిలోని రాయపుర, లష్కర్ బజార్‌లో రెండు రోజులకు ఒకసారి తాగునీటి సరఫరా జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

ఎమ్మెల్యే సొంతూరులో అంధకారం

అమీనాబాద్‌లో రెండు వారాలుగా వెలగని వీధి దీపాలు

చెన్నారావుపేట, ఏప్రిల్ 16 : నర్సంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సొంతూరు చెన్నారావుపేట మండలం అమీనాబాద్‌లో రెండు వారాలుగా వీధి దీపాలు వెలగకపోవడంతో అంధకారం నెలకొంది. గ్రామంలో సుమారు 16చోట్ల వీధిలైట్లు వెలగక గ్రామస్తులు రాత్రి వేళల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన చెందుతున్నారు. అధికారులకు విన్నవించినా తమ పరిధిలో లేదంటూ దాటవేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కొన్నాళ్ల కింద కొత్త వీధి లైట్లను ఏర్పాటు చేసి నిర్వహణ బాధ్యతను గ్రామ పంచాయతీకి కాకుండా కాంట్రాక్టర్‌కు అప్పగించింది. దీంతో సదరు కాంట్రాక్టర్‌కు తెలియజేసినప్పటికీ నిర్లక్ష్యం వహిస్తున్నాడని గ్రామస్తులు చెబుతున్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి వీధిలైట్లకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

కనీస ప్రమాణాలు పాటించాలి

హనుమకొండ, ఏప్రిల్ 16 : జిల్లాలోని బాలల సంరక్షణ కేంద్రాల్లో కనీస ప్రమాణాలు పాటించాలని అదనపు కలెక్టర్ రాధికాగుప్తా అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా సంక్షేమ అధికారి మధురిమ అధ్యక్షత సమావేశం నిర్వహించారు. బాలల సంరక్షణ కేంద్రాల నిర్వాహకులు బాల బాలికలకు వసతి, భోజనం, విద్య, వైద్యం తదితర వసతులు కల్పించాలన్నారు. ఇటీవల నాలుగైదు బాలల సంరక్షణ కేంద్రాలను తనిఖీ చేయగా వాటిలో సరైన వసతులు లేకపోవడం తన దృష్టికి వచ్చిందని తెలిపారు. ఈ నెల 22 నుంచి 28 వరకు జిల్లాలోని సంరక్షణ కేంద్రాలను అదనపు కలెక్టర్, ఆరుగురు సభ్యులతో కూడిన కమిటీ తనిఖీ చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీఆర్వో గణేశ్, అడిషనల్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ మదన్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ ప్లేయర్లకు అండగా ఉంటాం

హనుమకొండ, ఏప్రిల్ 16 : అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ ప్లేయర్లకు అండగా ఉంటామని, వారికి సైతం రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో వసతి కల్పించాలని బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వీరికి ఇప్పటి వరకు రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో భోజనం, నివాసం, శిక్షణ ఇతర వసతులు కల్పించారని, రానున్న రోజుల్లో సైతం కొనసాగించాలని డిమాండ్ చేశారు. వసతిని తరలిస్తే ఉద్యమిస్తామని హెచ్చరించారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ, యువజన, క్రీడల విభాగం అధికారులు స్పందించి అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడాకారులకు న్యాయం చేయాలని కోరారు.

మోడల్‌స్కూల్ గేటుకు తాళం వేసిన పేరెంట్స్

స్కూల్‌కు తాళం వేయడంతో బయట నిలబడిన విద్యార్థులు

ఖానాపురం, ఏప్రిల్ 16: వేధింపులకు గురిచేసి మండలంలోని బుధరావుపేట మోడల్‌స్కూల్ ఉపాధ్యాయురాలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడేందుకు కారకుడైన ఉపాధ్యాయుడిపై వెంటనే చర్యలు తీసుకోవాలని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. మంగళవారం స్కూల్ గేటుకు తాళం వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సింగు సుధాకర్, మోడెం ఎల్లగౌడ్, యోగానంద మాట్లాడుతూ వారం రోజుల క్రితం మోడల్‌స్కూల్‌లో ఓ ఉపాధ్యాయురాలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా దవాఖానలో చికిత్సపొందుతున్నట్లు తెలిపారు. కానీ ఉన్నతాధికారులెవరూ ఈ ఘటనపై విచారణ చేపట్టలేదని, వెంటనే స్పందించి బాధ్యుడైన ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలన్నారు. విషయం తెలుసుకున్న ఎంఈఓ రత్నమాల చేరుకొని విచారణ చేపడతామని నచ్చజెప్పడంతో గేటుకు తాళం తీశారు. కాగా, వేధింపులతో ఉపాధ్యాయురాలు ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఘటనపై ఎంఈఓ రత్నమాల, ఎంఎన్‌వో చరణ్‌సింగ్ మోడల్ స్కూల్‌లో విచారణ చేపటారు. ఉపాధ్యాయులు, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పూర్తిస్థాయి నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు. ఎమ్మార్సీ సిబ్బంది శశిధర్, భాస్కర్ పాల్గొన్నారు.

మోడల్‌స్కూల్ ఉపాధ్యాయుడి సస్పెన్షన్

బుధరావుపేట మోడల్ స్కూల్ ఉపాధ్యాయుడు దామెర రాజేందర్ సస్పెన్షన్‌కు గురయ్యాడు. ఇదే పాఠశాలకు చెందిన ఓ ఉపాధ్యాయురాలిని వేధింపులకు గురిచేసి ఈనెల 10న ఆమె ఆత్మహత్యాయత్నానికి కారకుడైనందున మోడల్ స్కూల్స్ అడిషనల్ డైరెక్టర్ సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

బీఆర్‌ఎస్ గ్రామ కమిటీల ఎన్నిక

ఐనవోలు, ఏప్రిల్ 16: మండలంలోని ఐనవోలు, పెరుమాండ్లగూడెం బీఆర్‌ఎస్ గ్రామ కమిటీలను మంగళవారం ఎన్నుకున్నట్లు మండల ఇన్‌చార్జి, వర్ధన్నపేట మార్కెట్ మాజీ చైర్మన్ గుజ్జ గోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీ ఐనవోలు గ్రామ అధ్యక్షుడిగా తాటికాయల కుమార్, ఉపాధ్యక్షుడిగా పల్లకొండ రాజేశ్, ప్రధాన కార్యదర్శిగా కాటబోయిన అశోక్, యూత్ అధ్యక్షుడిగా బరిగెల అనిల్, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా బండ మహేశ్, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడిగా బరిగెల(దుప్పెల్లి) రాజు, బీసీ సెల్ అధ్యక్షుడిగా అవునూరి నాగరాజు, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా అమరవాది రాజు, పార్టీ పెరుమాండ్లగూడెం గ్రామ అధ్యక్షుడిగా కోల సంపత్, ఉపాధ్యక్షుడిగా జిల్లా బాబు, పిడుగు ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా వరంగంటి రాములు, బూత్ కన్వీనర్‌గా పిడుగు రవి ఎన్నికైనట్లు వివరించారు. జడ్పీ కోఆప్షన్ ఉస్మాన్‌అలీ, మండల వైస్ ఎంపీపీ మోహన్, ఎంపీటీసీ సోమేశ్వర్‌రావు, మాజీ సర్పంచులు సదానందం, సురేశ్, స్వామి, మండల నాయకులు లక్ష్మణ్‌గౌడ్, మండల నాయకుడు దేవదాసు ఉన్నారు.

గ్రామ కమిటీ సమావేశంలో పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకులు

హామీల అమలుకు కాంగ్రెస్ సర్కారు వెంటపడతాం

- ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపు తథ్యం
- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

శాయంపేట, ఏప్రిల్ 16 : కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే వెంటపడతామని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. శాయంపేట మండల సన్నాహక సమావేశం పరకాలలోని జీఎంఆర్ గార్డెన్‌లో మంగళవారం జరిగింది. ముందుగా తెలంగాణ ఉద్యమకారుడు జలుగూరి రవీందర్ మృతి చెందడంతో రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నాలుగు నెలల్లోనే కాంగ్రెస్ సర్కారుపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందన్నారు. రూ.2లక్షల రుణమాఫీ, వరికి రూ.500 బోనస్, మహిళలకు రూ.2500, రైతు భరోసా కింద రూ.15వేల పెట్టుబడి సాయం, రూ.4వేల పింఛన్లు, ఇందిరమ్మ ఇల్లు లాంటి పథకాలు ఇప్పటివరకు అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు. కల్యాణలక్ష్మి కింద తులం బంగారం ఎందుకివ్వలేదని ప్రశ్నించారు. కేసీఆర్ పథకాలన్నింటినీ నిలిపివేసి పాలనను అస్తవ్యస్తం చేశారన్నారు. పరిపాలనా దక్షత లేక గోదావరి జలాలను వినియోగించుకోలేక వేల ఎకరాల్లో వరి, మక్కజొన్న పంటలు ఎండిపోయాయన్నారు. సాగునీరు, పెట్టుబడి లేక అప్పులతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే ప్రభుత్వ పెద్దలకు పట్టడం లేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి మారపెల్లి సుధీర్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. బీజేపీ, కాంగ్రెస్ దొందూ దొందేనని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ప్రతి ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇవ్వలేదని, నల్లధనాన్ని వెలికి తీసి అకౌంట్లో వేయలేదని, కోచ్ ఫ్యాక్టరీ రాలేదని, బయ్యారంలో ఉక్కు పరిశ్రమ నెలకొల్పలేదని, కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేదని, తెలంగాణకు అన్యాయం చేసిందని విమర్శించారు. భూపాలపల్లి జిల్లాలో చారిత్రక ప్రదేశాలు ఉన్నా పర్యాటక కేంద్రంగా ప్రకటించలేదన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న గండ్ర వెంకటరమణారెడ్డి

బలహీనులే పార్టీ వీడి వెళ్లిపోతున్నారు..

వరంగల్ జడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి

ఎన్నికల్లో ఓటమితో ఎలాంటి బాధ లేదని, పట్టుదలతో మళ్లీ గెలుస్తామని వరంగల్ జడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి అన్నారు. బలహీనులే పార్టీని వీడుతున్నారన్నారు. బీఆర్‌ఎస్‌లో ఎన్నో పదవులు అనుభవించిన కడియం శ్రీహరి కూతురుకు వరంగల్ ఎంపీగా కేసీఆర్ ప్రకటిస్తే మోసం చేసి తప్పుకోవడంతో శ్రీహరిపై ఉన్న గౌరవం పోయిందన్నారు. భూపాలపల్లిలో ఆలయం నిర్మిస్తే ప్రభుత్వ భూమిని అక్రమంగా తీసుకున్నట్లు ప్రచారం చేశారని, అధికారంలో ఉన్నవారు ఆధారాలతో చూపెట్టాలని చాలెంజ్ విసిరారు. సమావేశంలో ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ రామ్‌శెట్టి లతాలక్ష్మారెడ్డి, మండలాధ్యక్షుడు గంగుల మనోహర్ రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, మాజీ చైర్మన్ రాజిరెడ్డి, ఎంపీటీసీలు మేకల శ్రీనివాస్, స్వాతి, మాజీ సర్పంచ్ చిట్టిరెడ్డి రాజిరెడ్డి, మాజీ మండలాధ్యక్షుడు గుర్రం రవీందర్ పాల్గొన్నారు.